అభివృద్ధి పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ పోచమ్మకుంట కట్టపై జరుగుతున్న నూతన రోడ్డు పనులను గురువారం స్థానిక మాజీ కార్పొరేటర్ బొడిగే స్వాతికృష్ణగౌడ్ పర్యవేక్షించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతికృష్ణగౌడ్ మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ.. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ.. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గున్నాల అశోక్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రవిశంకర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, జైహింద్‌గౌడ్, శేషగిరిరావు, సంతోష్, వినయ్, సాయి, వార్డు ఆఫీసర్ అతిక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ లెక్కింపు

కుషాయిగూడ: పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. గడిచిన ఐదు నెలలకు రూ.7,41,193లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి మఠం వీరేశం ప్రకటించారు. హుండీ లెక్కింపులో ఆలయ ఫౌండర్ ట్రస్టీ యాదగిరిరెడ్డి, పల్లె సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి తగిన చర్యలు



ఉప్పల్: డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ అన్నారు. ఈ మేరకు గురువారం బాలాజీ ఎన్‌క్లేవ్ పార్కు అభివృద్ధి పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని పార్కులను పరిరక్షించడంతో పాటు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



బిక్షపతి

మేడిపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హేమానగర్‌కాలనీలో నివాసం ఉండే బండ్ల ప్రవీణ్ తన తల్లిదండ్రులతో గత కొంత కాలంగా నివాసం ఉంటున్నాడు. కాగా తండ్రి బిక్షపతి(51) కొన్ని నెలలుగా పక్షవాతంలో బాధపడుతున్నాడు. బిక్షపతి వాకింగ్ కోసం 3న ఉదయం 11.00 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట..



జంగయ్య

మేడిపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ఆర్ఎన్ఎస్ కాలనీలో కృష్ణయ్య తన తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. కాగా తండ్రి జంగయ్య(70)వాకింగ్‌కు ఈనెల 3న ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడు గోడు పట్టదా..?

- డబుల్‌బెడ్రూం కేటాయింపుల్లో అలసత్వం
- మిగిలిపోయిన 48 ఫ్లాట్లు..
- ఇళ్లకోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- సామగ్రిని ఎత్తుకెళ్తున్న దుండగులు

మల్లాపూర్: డివిజన్ పరిధి సింగంచెరువు తండాలో నిరుపేదలకు నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు కొందరికి కేటాయించగా.. మిగిలిన వారికి ఇంకా కేటాయింపులు చేపట్టలేదు. 48 మంది సొంతింటి కల ఇప్పటికి వరకు నెరవేరడం లేదు.

నేతల హామీ నెరవేరని వైనం..

ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీ ఇప్పటికి నెరవేరకపోవడంతో తండావాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సింగంచెరువు తండాలో రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న గుడిసెలను తొలగించి 176 ప్లాట్లు, మొత్తం 11 బ్లాక్‌లు, జీ+త్రీలో రూ.11.26 కోట్లతో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించారు.

పేదోడి కల నెరవేరేదెప్పుడో.. ?

2015లో సింగం చెరువు తండాకు వచ్చిన కేసీఆర్ తండాలో నివాసం ఉంటున్న వారందరికీ డబుల్ ఇళ్లను కేటాయిస్తామని పాలకులు హామీ ఇచ్చారు. 2018లో కలెక్టర్ ఆధ్వర్యంలో 128 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పంపిణీ చేశారు. మిగతావారికి 48 డబుల్ ఇళ్లను ఇప్పటికి వరకు కేటాయించకపోవడంతో వారు అద్దె ఇళ్లలో ఉంటూ.. కాలం వెల్లదీస్తున్నారు.

అనేకసార్లు వినతులు – ధర్నాలు..

మిగిలిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వెంటనే కేటాయించాలని పలుమార్లు కలెక్టర్, ఎమ్మార్వో, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చి ధర్నాలు కుడా చేశామని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడడిగినా.. కేటాయిస్తామని చెప్పడమో.. తప్పా.. కేటాయించడం లేదని వాపోతున్నారు.

శిథిలావస్థకు చేరుతున్న వైనం

48 ప్లాట్లు ఎవ్వరికీ కేటాయించకపోవడంతో డోర్లు, కిటికీలు పాడుబడి చెట్లు ఏపుగా పెరిగిపోతున్నాయి. కొన్ని ప్లాట్లలో కిటికీలు, డోర్లు విద్యుత్ ప్యానల్ బోర్డును ఎత్తుకెళ్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూమ్‌లు అన్ని అపరిశుభ్రంగా మారాయని, క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారుతున్నాయని వాపోతున్నారు.



అపరిశుభ్రంగా ఆవరణ, మాయమైన విద్యుత్ ప్యానల్స్



సింగం చెరువు తండాలోని డబుల్ బెడ్రూం భవనం

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



సింగం చెరువు తండాలో రెండెకరాల స్థలంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను తండావాసులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మా పేదలపై దృష్టి సారించి పేదల సొంతింటి కలను నెరవేర్చాలి.

– తేజావత్ మంగీ, సింగం చెరువుతండా

కలెక్టర్ దృష్టి సారించి కేటాయింపులు చేపట్టాలి



రాష్ట్రప్రభుత్వం మొదటగా సింగం చెరువు తండాలో పేదల కోసం డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కట్టించింది. ఇళ్ల స్థలాలు కోల్పోయిన మిగిలిన 48 మందికి ఇళ్లను కేటయించాలి. ఎన్నో ఏళ్లుగా ఇళ్లను కేటాయించాలని పోరాటం చేస్తున్నాం . కలెక్టర్, ప్రజాప్రతినిధులు మా సమస్యను పట్టించుకోవాలి.

– పీరునాయక్, తండా అధ్యక్షుడు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, మంగాపురం కాలనీలో రూ.24 లక్షలతో నిర్మించ తలపెట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ల అవసరాలను తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఏతం వేణుగోపాల్, బీఆర్ఎస్ డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్, అశోక్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కనకయ్య, అలీమోద్దీన్, సాయికుమార్, బాలయ్య, శేఖర్‌గౌడ్, దండెం నరేందర్, నిస్సార్ అహ్మద్‌గోరి తదితరులున్నారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని వీఎస్టీ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పర్యటించారు. రేణుకాఎల్లమ్మ దేవాలయం ఎదుట వీధి, పక్క వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. డ్రైనేజీ పూర్తయినా వెంటనే సీసీ రోడ్డు పనులు మొదలుపెడతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, సూపర్‌వైజర్ రాకేష్, కాలనీవాసులు జాన్‌వెస్లీ, సుగుణాకర్‌రావు, వాసు, రోహిత్, తదితరులున్నారు.

టీచర్స్ డే వేడుకలు



అల్వాల్: అల్వాల్ ప్రొగ్రెసివ్ హైస్కూల్‌లో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమానికి ఏసీపీ వెంకట్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తమ విద్యార్థులు ఎంతో ఉన్నతమైన స్థానంలో ఉండాలని, సమాజంలో గౌరవాన్ని దక్కించుకుంటే అదే వారికి గర్వకారణంగా భావిస్తారన్నారు. భావిపౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత, చైర్మన్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

శామీర్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ.. లక్ష్యాన్ని చేరుకోవాలని శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని జగ్గంగూడ జీనియస్ గ్రామర్‌స్కూల్‌లో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. గత మూడ్రోజులుగా నిర్వహించిన శామీర్‌పేట్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలైన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను ఎస్‌జీఎఫ్ జోనల్ క్రీడల కార్యదర్శి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

జలమండలి అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కౌకూర్ గృహకల్పలో మౌలిక వసతులు, తాగునీటి అలోకేషన్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కౌకూర్ జనప్రియ ఆర్కేడ్‌కు సంబంధించి అవసరమైన అండర్ టేకింగ్ లెటర్ (అఫిడవిట్) తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

- మచ్చబొల్లారంలోని 7 కాలనీలకు ట్రంక్ మెయిన్ ఏర్పాటు పనులను పూర్తి చేయాలన్నారు.

బోర్‌వెల్స్‌కు సంబంధించి మీటర్ల అనుసంధానం కోసం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. జలమండలి మేనేజర్ సునీల్, డీజీఎంలు సాంబయ్య, రాజు, మేనేజర్లు మల్లికార్జున్, సృజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఔషధ విక్రయాలు



అల్వాల్: ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఔషధ విక్రయాలు చేయాలని మల్కాజిగిరి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ అన్నారు. గురువారం అల్వాల్‌లో మెడికల్ కెమిస్ట్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మెడికల్‌షాప్ యాజమానులకు ప్రభుత్వ నిబంధనలు, పాలసీపై అవగాహన కల్పించారు. తయారీదారులు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు చేసే పొరపాట్లు రిటైలర్లు బాధ్యులు కాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ప్రిస్క్రిప్షన్లు, బ్యాచ్ నెంబర్లు లేకుండా ఎవరూ..? మందులు అమ్మకూడదన్నారు. అసోసియేషన్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌శర్మ, ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, కోశాధికారి నాగరాజు, అల్వాల్ మండల అధ్యక్షులు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి వెంకటనర్సయ్య, అల్వాల్ మెడికల్ షాప్‌ల యజమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

మల్లాపూర్: కేఎల్‌రెడ్డినగర్ కాలనీలో సాయిఅకాడమీ గురువు లక్ష్మీసౌజన్య శిష్యుం బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన ఎంతగానో అలరించింది. లాస్య, సహస్ర, యుతిక, ధృతి, సాన్వి, శ్రీవల్లి, స్వప్న, షన్విత, అనన్య, సాయిగగన్‌లు ప్రదర్శించి మెప్పించారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకుబ్‌రెడ్డి కళాకారులను అభినందించి మెమోటోలను అందజేశారు. శ్రీసాయి అకాడమీ అధ్యక్షురాలు నళిని తదితరులున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



వాణి, మౌలాలి బాలికల హైస్కూల్



కల్యాణి, మౌలాలి బాలికల హైస్కూల్

అల్వాల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను ప్రకటించారు. అల్వాల్ మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జెడ్పీహెచ్ఎస్ అల్వాల్ బాలికల స్కూల్ తెలుగు టీచర్ సువర్చల, జెడ్పీహెచ్ఎస్ కౌకూర్ స్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు భారతి, ఫిజికల్ సైన్స్ టీచర్ భారతిలక్ష్మి, జెడ్పీహెచ్ఎస్ దొడ్డి అల్వాల్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, మచ్చబొల్లారం ఎంపీపీఎస్ స్కూల్ హెచ్‌ఎం జయశ్రీ, కౌకూర్ ఎంపీపీఎస్ స్కూల్ టీచర్ రాజ్యలక్ష్మి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ అవార్డులను ఈ నెల 9న కలెక్టరేట్ కార్యాలయంలో అందుకోనున్నారు.

మల్కాజిగిరి నుంచి నలుగురు..



సాయప్ప, ఎంపీపీఎస్ బాలుర పాఠశాల



శ్రీనివాస్, జిల్లా పరిషత్ బాలికల స్కూల్

మల్కాజిగిరి: మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మౌలాలి బాలికల హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్) ఉపాధ్యాయురాలు వాణి, స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్) ఉపాధ్యాయురాలు కల్యాణి, ఎంపీపీఎస్ బాలుర పాఠశాల మల్కాజిగిరికి చెందిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు సాయప్ప, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఒకేషనల్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. మండల విద్యాధికారి అంబటి సురేష్‌తో పాటు తోటి ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

ఆర్‌కేనగర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



రాఘవేంద్ర మఠం వినాయకుడి మండపం వద్ద..



సాయిఎన్‌క్లేవ్‌లో మాజీ కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి



మల్లికార్జుననగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్‌లో..



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహ



భక్తిశ్రద్ధలతో పూజలు



రామంతాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



కాప్రాలో జాతీయ క్రీడాకారిణి నందిని అగసర, కార్పొరేటర్ శిరీష



ఉప్పల్ బేబీ పాండ్‌లో గణనాథుల నిమజ్జనం

జైజై గణేశా..

జయములివ్వు బుజ్జిగణేశా.!

ఉప్పల్, మల్కాజ్‌గిరి జోన్ పరిధిలోని పలు మండపాలలోని గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం వీఐపీల తాకిడితో మండపాలు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు నిమజ్జనాలను ఆటపాటలు, డప్పుచప్పుళ్లతో వైభవంగా నిర్వహిస్తున్నారు. పలు చోట్ల అన్నప్రసాద వితరణ జరుగుతుంది. మరోవైపు నిమజ్జనానికి అధికారులు ముందుగానే అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా శాంతిభద్రతలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



ప్రత్యేక పూజల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

– ఉప్పల్/మల్కాజిగిరి జోన్ల బృందం



నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలోని గణనాథుడు




కొత్త చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ శాంతి



నిమజ్జనానికి అందుబాటులో ఉన్న భారీ క్రేన్లు

జోరుగా నిమజ్జనాలు



కాప్రా చెరువు వద్ద..



చర్లపల్లిలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



ఈసీఐఎల్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

నియామకం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం సమతానగర్‌కు చెందిన ఉప్పు విజయ్‌కుమార్ పటేల్ తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియమించిన ఆర్. కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ యువజన సంఘం రాజ్‌కుమార్ సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.